# వేయిన్నొకటి

ఆదిలక్ష్మికి ఆక్రోశంగా వుంది. ఆ దుఃఖం ఆమెని ఒక్క నిముషం కూడా స్థిమితంగా నిలబడనీయడంలేదు. మూడు రోజులుగా గుక్కెడు నీళ్ళు తాగిందేమోగానీ, పట్టెడు అన్నం తినలేదు. రెండు చుక్కల పాలుగానీ, కాఫీగానీ, టీగానీ తాగలేదు. ఇంక ఫలహారం గురించి చెప్పేదేముంది. ఇంట్లో ఎవ్వరికీ సరిగ్గా తెలీదు సంగతి. ఆమెందుకు బాధపడుతుందో కూడా ఎవరికీ తెలీదు. అసలు బాధపడుతోందని కూడా తెలీదు. ఆమె తిన్నదీ, లేనిదీ పట్టించుకున్నవారు లేరు.

ఇంక ఈ నరకబాధ తను భరించలేననుకుంది ఆదిలక్ష్మి. తనకి విముక్తి కావాలి. ఈ బాధ కొద్దికాలానికి అనేకరకాల అవమానాలకి దారితీస్తుందని ఊహించింది. తల్లిగా తను తలవంచుకుని ఆ అవమానం స్వీకరించలేనని నిర్ణయించుకుంది.

పాతిక నిద్రమాత్రలు ఒలుచుకుని పెట్టుకుంది. రెండు బాటిల్స్ నీళ్ళు ఎదురుగా పెట్టుకుని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ఒక్కక్షణంలో దుఃఖం వరదలా పొంగుకొచ్చేసింది. అంతలోనే చచ్చిపోవడానికి ధైర్యాన్ని కూడదీసుకుంది.

గుప్పెట్లో మాత్రలు అంచెలంచెలుగా మింగి నీళ్ళన్నీ తాగేసింది. కనీసం అరగంట వ్యవధి ఉంటుంది కదా అనుకుంది. జరిగింది మళ్ళీమళ్ళీ ఆమె మస్తిష్కంలో గిరగిరా తిరుగుతూ పిండిమరలా రొద చేయడం మొదలుపెట్టింది. మగత కమ్మేసేలోగా ఆమె మనసు చురుకుగా గతాన్ని నెమరువేస్తోంది.

❖ ❖ ❖

సంధ్య ఇంట్లో అడుగుపెడుతూనే "వదినా! వదినా" అంటూ విసురుగా పిలుస్తూ వచ్చింది. ఆ విసురులో ఉత్సాహం కలగలిసి వుంది. ఆదిలక్ష్మి "రావమ్మా రా - అందాల హడావిడి ఆడపడుచా" అంటూ వెళ్ళి వాటేసుకుంది.

"ఏం ఆడపడుచో -, ఒక మర్యాదలేదు, మన్నన లేదు - అన్నింటికీ నేనే ఎదురు రావాలి గానీ - నువ్వు కదలవు కదా!" అంది.

"ఇప్పుడు నీకొచ్చిన లోటేవిటి? విషయం చెప్పు" అంది బుజ్జగింపుగా ఆదిలక్ష్మి.

సంధ్య మూతి మూడు వంకర్లు తిప్పి "కబుర్లకేం లోటులేదు" అంది.

ఇంతలో వాసు గదిలోంచి బయటకొచ్చి "ఏమిటే సందీ - రావడమే తుఫానులా వచ్చావు. అంతా బాగున్నారా" అన్నాడు.

"నువ్వూ ఇక్కడే వున్నావా? మరీ మంచిది. ఇద్దర్నీ కలిపి ఒకేసారి అడిగేస్తాను" అంది సంధ్య.

"అడగవమ్మా! నీకన్నా మాకు పరాయివాళ్ళెవరున్నారు" అంటూ కొంటెమాట విసిరాడు అన్నయ్య వాసు.

"అన్నయ్యా! ఇది వేళాకోళం కాదు, సీరియస్" అంది.

"ఇంతకీ సంగతేమిటో చెప్పు"

"మా సాకేత్‌కి ఉషనిస్తారా లేదా" అంది.

ఆదిలక్ష్మి చటుక్కున వెళ్ళి ఆడపడుచు చేతులు పట్టుకుంది.

"ఎంత మాటన్నావు సంధ్యా" అని కుర్చీలో కూర్చోబెట్టింది.

"మేమిద్దరం వద్దామనుకుంటున్నాం... నిన్నూ, మీ ఆయన్నీ ఇదే విషయం అడగాలని" అంది.

"ఏదీ రాలేదుగా" -

"ఉష ఈవారం చివర వచ్చేస్తుంది. దానికిక్కడికి ట్రాన్స్‌ఫరైంది. వచ్చిన వెంటనే దానితో ఒక మాట చెప్పి..." అంటూ ఆగాడు వాసు.

"అంటే నీ కూతురికి కొత్తగా చెప్పాలన్నమాట" అంది బుంగమూతి పెట్టి.

"మా సాకేత్‌తో నేనేం మాట్లాడలేదే. నేనెంతంటే, అంతే వాడికి" అంది.

"మరీ పాతకాలం మాటలు మాట్లాడకు. ఎదిగిన పిల్లలు. చదువుకీ, ఉద్యోగాలకీ, ఊళ్ళట్టుకు తిరుగుతున్నవాళ్ళు" నెమ్మదిగా అంది ఆదిలక్ష్మి.

అందరూ కబుర్లలో పడి, జోక్స్ వేసుకుంటూ, వేళాకోళాలు చేసుకుంటూ గడిపేశారు. ఆ రాత్రే సంధ్య రిజర్వేషన్ వుందని వెళ్ళిపోయింది. ఆదిలక్ష్మి మనసు ఆనందంతో ఆకాశంలో ఎగురుతోంది.

నాలుగు రోజుల తర్వాత ఆదివారం ఉదయం ఉష దిగింది. వస్తూనే గలగల మాట్లాడుతూ అందర్నీ అలరించింది. అరగంటలోనే ఆదిలక్ష్మి కూతురికి చెప్పింది-

"మొన్ననే సంధ్యత్త వచ్చి వెళ్ళింది".

"ఉండాల్సింది నేనొచ్చేవరకు"

"దానికి సంసారం వుందికదా! ఇంతకీ అంత అర్జంటుగా ఎందుకొచ్చిందో తెలుసా!"

"నాకేం తెలుసు. మీరు చెప్తేకదా"

"నీ పెళ్ళి - బావతో ఖాయం చేసుకుందామని"

ఉష ముఖం చిన్నబోయింది,

"నువ్వేమన్నావు" అంది తల్లివైపు చూడకుండా.

"అనడానికేముంది? ఎప్పట్నుంచో అనుకుంటున్నదే కదా!"

ఉష మాట్లాడలేదు. లోపలికెళ్ళిపోయింది. ఆదిలక్ష్మి గుండెల్లో రాయి పడింది.

ఉష బొద్దుగా, తెల్లగా వుంటుంది. చూడంగానే ఆకర్షణీయంగా వుంటుంది. దూరం నుంచి చూసినా, మెత్తగా దూది పింజలా వుంటుందామె వొళ్ళు అనిపిస్తుంది. బొద్దుగా వున్నప్పటికీ మహాచలాకీగా వుంటుంది. గలగలా మాట్లాడేస్తూ పకపకా నవ్వేస్తూ, చెంగుచెంగున గెంతేస్తూ తిరిగేస్తుంటుంది. ఆ గుణాలన్నీ మేనత్త సంధ్యకి ఎంతో యిష్టం. ఎప్పట్నించో ఉష తన కోడలని చెప్పుకుని మురిసిపోతూ వుంటుంది. దానికి తగ్గట్టుగా సంధ్యకి అందమైన ఆరడుగుల కొడుకున్నాడు. అతనికి అందరూ ఆశించే ఇంజనీరింగ్ చదువుంది. ఈమధ్యనే మంచి జీతంతో ఉద్యోగమొచ్చింది. అలాంటి సంబంధం మామూలుగా తీసుకురావాలంటే లక్షలు పొయ్యాలి. - కావాల్సిన సంబంధం, కావాలని చేసుకోవడం వల్ల చాలా బాధలు లేవు. ఆదిలక్ష్మి దేనికీ లోటు చెయ్యదు. సంధ్య పేచీలూ పెట్టదు.

ఒక్కొక్కసారి ఆదిలక్ష్మికి కూతుర్ని చూస్తే భయమేస్తుంది. ఇక్కడే ఇంజనీరింగ్ చదివినంతకాలం తల్లి కొంగుపట్టుకుని తిరిగేది. తల్లి చెప్పినట్టు డ్రస్, డ్రస్ రంగు - జుట్టు, బొట్టూ అన్నీ అమ్మ చెప్పినట్టే. రెండేళ్ళ క్రితం బెంగుళూరులో ఉద్యోగం వచ్చి వెళ్ళింది. అంతే పూర్తిగా మారిపోయింది. తల్లిని చూస్తే ఒకటే విసుగు. ఆమె దగ్గర కూర్చుని ఒక్కక్షణం కూడా మాట్లాడేందుకు ఇష్టపడడం లేదు. ఏదోఒక వంక పెట్టుకుని తుర్రుమని పారిపోతోంది. బట్టల సెలక్షన్ మారిపోయింది. రంగుల ఎంపిక

మారిపోయింది. తల్లి ఏది చెప్పినా విసుగే. విదిలించి పారేయడమే. ఆదిలక్ష్మికి ఎంతో అవమానం కలిగినా కన్నకూతురు కదాని సర్దుకుపోతోంది. మనసులో ఆమెకి చిన్నభయం బయలుదేరింది. తనతో ప్రవర్తించినట్టే సంధ్యతో కూడా ప్రవర్తిస్తే, ఏం బాగుంటుందీ అని భయంగా వుంది.

ఈరోజు పెళ్ళి మాట చెప్పగానే ముఖం ముడుచుకుని వెళ్ళిపోయింది. ఆదిలక్ష్మి అందరి దేవుళ్ళకీ మొక్కుకుంది. ఉష మనసులో వేరే ఊహలేమీ లేకుండా చెయ్యమని.

ఈ రాత్రి ఉషని గట్టిగా పట్టుకుని విషయం తేల్చేయాలనుకుంది. మొన్న సంధ్య వచ్చి అడిగితే ప్రాణం చచ్చిపోయినట్టనిపించింది. వదిన వెక్కిరించింది కూడా, ఆడపడచు వచ్చి అడగడం ఎక్కడా చూళ్ళేదు. ఏమైనా మీ ఆడబిడ్డ మంచిది అంటూ తనకి ఒక చురక వేసింది.

చదువులు పెద్దగా చదివినా వేరే ఊళ్ళకి ఉద్యోగానికి వద్దు అంటే వినిపించు కున్న వారెవరూ? బాహాటంగా బయట మసలుతుంటే, తల్లిదండ్రులకి దూరంగా, స్నేహాలు, షికార్లు, సినిమాలు, ప్రేమలు - పెళ్ళిళ్ళూ అంటూ మొదలవుతాయి. తీరా వాళ్ళొక నిర్ణయానికొచ్చాక మనం చచ్చి గీపెట్టినా లాభం వుండదని తను చాలాసార్లంది. కాని వినిపించుకోలేదు.

ఆదిలక్ష్మి వేగంగా ఆలోచిస్తూ, నాలుగ్గంటలకే వంట పూర్తిచేసి కూర్చుంది. చీకటి పడగానే ఉషని డాబా మీదికి తీసుకెళ్ళి నాలుగు విషయాలు స్పష్టంగా చెప్పాలి. ముఖ్యంగా దాని చేతిలో సెల్‌ఫోన్ లేకుండా చూడాలి. లేకపోతే, తను మాట్లాడగానే అది మోగుతుంది. ఇక అంతే -, ఓ పకపకలు - వికవికలు. ఓ పట్టాన అది పూర్తి కాదు. చెప్పేది మధ్యలో ఆగిపోతుంది. మళ్ళీ మొదటికొస్తుంది. "ఇంతకీ ఏమిటీ" అంటూ విసుగ్గా ముఖంపెట్టి, తనేం చెప్పినా 'సర్లే చూద్దాం' అంటూ చక్కాపోతుంది.

ఈరోజలా జరక్కుండా చూడాలి. గట్టిగా పట్టుకుని 'ఊ' అనిపించి వదలాలి. ఆదిలక్ష్మి గట్టి నిర్ణయంతో స్థిమితపడింది.

సరిగ్గా సాయంత్రం అయిదున్నరకి రెండు బ్యాగులతో సమీర ఆటో దిగింది. ఆదిలక్ష్మికి ఒళ్ళు మండిపోయింది. ఉత్సాహమంతా ఉఫ్‌మని ఎగిరిపోయింది. మామూలుగానే ఉష ఆకుకందదు పోకకు పొందదు అన్నట్టు వుంటుంది. ఇంకీ సమీర వచ్చిందంటే తనకేం దొరుకుతుంది?

ఆదిలక్ష్మి నీరుకారిపోయింది. ఉష ఉత్సాహంతో పరుగెట్టుకెళ్ళి ఫ్రెండుని వాటేసుకుంది. ముఖం మాడ్చుకున్నా మర్యాదకోసం పలకరించింది ఆదిలక్ష్మి. తన సమస్య భూతంలా ఆమెను భయపెట్టడం మొదలుపెట్టింది.

ఇద్దరూ చేతుల్లో చేతులు కలుపుకుని ఎడతెరిపి లేకుండా మాట్లాడేసుకుంటుంటే ఆ తండ్రి వాళ్ళ స్నేహంచూసి మహదానందపడిపోతున్నారు. చూసినకొద్దీ ఆదిలక్ష్మికి చిరాకు పెరిగిపోతోంది.

ఆదిలక్ష్మి దృష్టితో చూస్తే సమీర చీదరగానే అనిపిస్తుంది. మగరాయుళ్ళా క్రాపు కొట్టించుకుంది. మడమల దగ్గర చిరిగి చీలికలైన జీన్స్ ప్యాంటు వేసుకుంది. ఎర్రటి టీషర్టు పాతగా వున్నది వేసుకుంది. దానివెనుక 'కిస్‌మీ' అని పెద్దపెద్ద అక్షరాలు వెక్కిరిస్తున్నాయి. ఉద్యోగానికి ఇలాంటి డ్రస్‌లు వేసుకునే వెళ్తుందా? అని చిరాకుపడి పోయింది ఆదిలక్ష్మి. ఉష మాత్రం తల్లి భావాలేం పట్టించుకోవడంలేదు. హాయిగా వాళ్ళు మాట్లాడేసుకుంటున్నారు. ఇద్దరూ ఏడాదిగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా బెంగుళూరులో పనిచేస్తున్నారు. ఇద్దరూ ఇక్కడి బ్రాంచ్‌కి ట్రాన్స్‌ఫరై వచ్చేశారు. కూతురొచ్చిందని ఆనందపడబోతుండగా, వెనకాలే తోకలా సమీర వచ్చేసరికి ఆదిలక్ష్మి చిరచిరలాడి పోతోంది. ఆమె మనోభావాలు కొంతవరకు పసికట్టిన వాసుదేవరావు ఆశ్చర్యపోయాడు. పిల్ల స్నేహితులు రావడం– వాళ్ళు ఆంటీ ఆంటీ అంటూ ఆమె వెంట తిరగడం –, ఆమె కూడా వాళ్ళని ఉషతో సమానంగా ఆదరించి ప్రేమించడం ఎప్పుడూ జరిగే విషయమే. మరెందుకిలా? ఉష పెళ్ళి విషయంలో నిర్లక్ష్యంగా వుందని ఆమె బాధపడుతోందని అతనికర్థమైంది. ఉషతో మాట్లాడడానికి అవకాశం యివ్వడంలేదని అవమానపడి పోతోందని కూడా అతనికి కొంత అర్థమైంది.

❖ ❖ ❖

ఉదయం ఎనిమిదిన్నరైంది. నిన్న ఆరేసిన బట్టలు డాబామీదే మర్చిపోవడం వల్ల, అవి తీసుకొచ్చి కింద ఆరేద్దామని, బయలుదేరిన ఆదిలక్ష్మికి ఉష, సమీరా ఇంకా నిద్రలేవలేదేమిటని డాబామీద ఉన్న సింగిల్ బెడ్‌రూంలోకి అడుగుపెట్టింది. లోపల గడియవేసి లేకపోవడంతో తలుపు తోసుకుని లోపలికి వెళ్ళిన ఆమె అవాక్కయి, స్థాణువులా వుండిపోయింది. ఇద్దరూ ఒకే మంచంమీద మెలికలు చుట్టుకుపోయిన పాముల్లా పడుకుని ఉన్నారు. వంటిమీద బట్టలు అంతంతమాత్రంగా ఉన్నాయి. ఒక్క నిముషంలో ఆదిలక్ష్మికి అంతా అర్థమైపోయింది. ఒళ్ళంతా గజగజ వొణికి పోయింది. ముఖంలోకి వేడిగా, వేగంగా రక్తపోటు తన్నేసినట్టుగా అయిపోయింది. వాళ్ళని లేపాలనిగానీ, వాళ్ళ ముఖాలు చూడాలనిగానీ అనిపించలేదు. మెట్లమీంచి దొర్లిపోతానేమోనని భయపడుతూనే పరుగు లాంటి నడకతో కిందకొచ్చేసి, తమ బెడ్‌రూంలో మంచంమీద వాలిపోయింది.

ఆ తర్వాత రోజంతా వాళ్ళిద్దరికీ ఎదురుపడకుండా తప్పించుకుని మసలింది. వారస్సులు ఈమెనుగానీ, ఇంటి వాతావరణాన్ని గానీ పట్టించుకునే స్థితిలో లేరు.

ఆదిలక్ష్మిలో కోపం తారస్థాయికి చేరుకుంది. ఉషని పీకపిసికి చంపేద్దామని చాలాసార్లు లేచింది. కానీ తమాయించుకుంది. భర్తతో ఈ సంగతి చెప్దామని ముందుగా అనుకుంది. కానీ అతనొక విచిత్రమైన మనిషి. భార్య ఏది చెప్పినా, దాన్ని వ్యతిరేకించడం, సంభాషణని పక్కదారి పట్టించడం – చివరికి ఆమెనొక ఫూల్‌గా చూసీ గేలీచేసి వదిలేయడం సర్వసాధారణం. అతను స్థిమితంగా తను చెప్పింది వింటాడనే నమ్మకం ఎంత ఆలోచించినా కలగలేదు. అందుచేత ఆమె ఒక అవమానంలోకి, ఒక జుగుప్సలోకి, ఒక విషాదంలోకి, ఒక నిరాశలోకి జారిపోయింది. అప్పుడామెకి ఒక్కటే మార్గం కనిపించింది. తనీ పరిస్థితుల్ని ఎదుర్కొంటూ అవమానంతో దోషిలా అందరిముందూ సంజాయిషీ ఇచ్చుకుంటూ నిలబడే శక్తి తనకి లేదు. తనీ పరిస్థితి నుంచి నిష్క్రమించాలి అంటే చచ్చిపోవాలి. అదొక్కటే సరైన పరిష్కారం అని గట్టిగా అనిపించింది.

❖ ❖ ❖

'అమ్మా! నిద్రపోకండి – అమ్మా కళ్ళు తెరవండి – కళ్ళు తెరవండి, నిద్రపోకండి' అంటూ నర్స్ ఆమెని కుదిపేస్తోంది.

ఆదిలక్ష్మికంతా అయోమయంగా వుంది. అతికష్టంమీద కళ్ళు తెరుస్తోంది. మూసుకుపోతున్నాయి. తెరిపిమరుపులుగా ఒక్కొక్కటే గుర్తుకొస్తున్నాయి.

మూడురోజులు ఘోరమైన ట్రీట్‌మెంట్ చేశాక, ప్రాణానికి ప్రమాదం లేదని తేల్చిచెప్పారు. ఎక్కువ టాబ్లెట్స్ మింగేయడం, ఇంట్లోవాళ్ళు ఆలస్యంగా చూసి హాస్పిటల్‌కి తీసుకురావడం, ప్రాణంమీదకి తీసుకొచ్చాయి. అయితే సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌వారు అంచులదాకా వెళ్ళిపోయిన ఆదిలక్ష్మిని వెనక్కి లాక్కొచ్చారు. వాసుదేవరావు కంగారుపడి పోయాడు. అతనికీ భార్య ఆదిలక్ష్మికీ పెద్దగా గొడవలేం లేవు. ఆత్మహత్యకి పాల్పడేటంత పరిస్థితి ఎందుకొచ్చిందో అర్థంకాలేదు.

"ఒకవేళ దానికిష్టం లేకపోతే, ఇష్టమైన వాడినే చేసుకోనీండి. దానికింత గొడవపడి ప్రాణాల మీదికి వదినెందుకు తెచ్చుకుందో తెలీటం లేదు" అంటూ సంధ్య వలవలా ఏడ్చింది.

ఆర్నెల్లు హడావిడిగా గడిచిపోయాయి. వాసుదేవరావుకి విషయం అర్థమైంది. కలవరపడ్డాడు. ఉషకి ఎంతో నచ్చచెప్పడానికి ప్రయత్నించాడు. ఆమె వినలేదు.

సమీరని వదిలి తనుండలేనని చెప్పేసింది. ఆ చెప్పిన మూడు రోజులకి ఉష - సమీర కలిసి వేరే ఫ్లాట్ తీసుకుని దూరంగా వెళ్ళిపోయారు. తల్లి పరిస్థితి చూసినా ఆమె పెద్దగా చలించలేదు. అదొక ఉన్మాదస్థితిగా అర్థం చేసుకుని తండ్రి తల బాదుకున్నాడు.

"వైద్యపరంగా నీ జీవన విధానం మంచిదికాదు. స్వలింగసంపర్కం వల్ల ఎయిడ్స్ వచ్చే అవకాశం వుందని వైద్యనిపుణులు చెప్తున్నారు" అన్నాడు వాసుదేవరావు ఉషని పట్టుకుని చివరిగా - ఆమె అదేం పట్టించుకోకుండా వెళ్ళిపోయింది.

దగ్గర మిత్రులు ఆమెకి కౌన్సిలింగ్ చేయించమన్నారు. ఆమె వాళ్ళ దగ్గరగా మసిలితేనే కదా! ఏదైనా ప్రయత్నం. వాసుదేవరావు ఆదిలక్ష్మి మీదనే దృష్టి నిలిపాడు. ఏమైనా ఆమెని రక్షించుకోవాలని తీవ్ర ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఆదిలక్ష్మి స్తబ్దుగా, నిరాసక్తంగా, పిచ్చిచూపులు చూస్తూ అయిపోయింది. ఆరోగ్యం బాగానే వుంది. ఆమెకే కౌన్సిలింగ్ చేస్తే, ఆలోచనా ధోరణి మారుతుందని చెప్పారు. వాస్తవాన్ని యథాతథంగా స్వీకరించే శక్తి వస్తుందని చెప్పారు. "ఆమెకి కాస్త ఉత్సాహం, సంతోషం కలిగించే వాతావరణం కల్పించండి. పిల్లలు ఎంపిక చేసుకున్న జీవన విధానాన్ని బట్టి తమ ఇంటి పరువు ప్రతిష్ఠ పోతాయనీ తల్లిదండ్రులు భావించకూడదు. పిల్లలు మనలాగే ఆలోచించి, మన ఆచారాలు, అభిప్రాయాలు తు.చ. తప్పకుండా అనుసరిస్తారని, మనం చెప్పిన పెళ్ళి చేసుకుంటారని ఆశించకూడదు. రాజకీయ, సామాజిక, ఆర్థికపరమైన మార్పులు వేగంగా వస్తున్న సమయంలో కన్నపిల్లలు పదహారేళ్ళు దాటినప్పటినుంచీ వారి అభిప్రాయాలు, ఆలోచనలు వారే ఏర్పరచు కుంటారని తల్లిదండ్రులు గ్రహించాలి. కులం, మతం, చదువు, సంపాదన, పెళ్ళి గురించి వారి సొంత భావాలు ఏర్పరచు కుంటారు. వారు కులాంతర వివాహం చేసుకున్నారనో, మతం మార్చుకున్నారనో, వేరే రకమైన జీవన విధానాన్ని ఎంచుకున్నా రనో మన పరువు ప్రతిష్ఠలు పోయాయని బాధపడడం అజ్ఞానమే అవుతుంది. తల్లిదండ్రులకి అవి తప్పుగా, చెడుమార్గాలుగా తోచవచ్చు. కానీ, వారి జీవితాలు వారే జీవించాలి కనుక, వారి కష్టసుఖాలు వారే ఎదుర్కోవాలి కనుక తల్లిదండ్రులు ఏం చేయలేరు. ఇది ఆడపిల్లలైనా, మగపిల్లలైనా ఒకటే - మన జీవితాలే కాక పిల్లల జీవితాలు కూడా మనమే జీవించాలనుకోవడం తల్లిదండ్రుల వెర్రే అవుతుంది - నిజమే, అహం దెబ్బతింటుంది. కోపంతో మనసు రగిలిపోతుంది. క్రోధం పెరుగుతుంది. మనసుకి సుఖముండదు.

ఆడపిల్ల మగపిల్లవాడ్ని ప్రేమించాలి. మగపిల్లవాడు ఆడపిల్లని కోరుకోవాలి. ఇది సహజం. కానీ ఒక్కొక్కసారి అసహజంగా ఈ హోమో సెక్సువల్ అనుబంధం ఏర్పడే అవకాశమూ ఉంటుంది.

మన సంస్కృతిలో ఇవేమీ లేవనీ, ఇవన్నీ పాశ్చాత్య దేశాల ప్రభావం అనీ మనం అనుకుంటాం. కానీ అది నిజంకాదు. మన సంస్కృతిలోనూ అన్నీ వున్నాయి. మరుగునపడి ఎన్నో వుంటాయి. ప్రతి జాతి జీవన విధానం, మనుగడలోనూ హోమోసెక్స్ వుంది. దాన్ని ఏనాడూ సమాజం అంగీకరించలేదు. ఇప్పుడిప్పుడే దాన్ని ఆమోదిస్తున్నారు. అది చాటుమాటుగానే సాగుతుంటుంది. ఆ స్థితినుంచి వాళ్ళని బయటికి లాగ గలిగితే మంచిదే."

ఇలా ఆదిలక్ష్మికి ఎన్నోవిధాల కౌన్సిలింగ్ జరిగింది. ఆమెలో నెమ్మదిగా చలనం మొదలైంది.

ఎప్పుడైనా మీ అమ్మాయి ఆ జీవితం మీద విరక్తిచెంది మీ దగ్గరికొస్తే, ఆదరించండి. ఆదిలక్ష్మి ఆలోచిస్తూ వుండిపోయింది. నిద్రమాత్రలు మింగడం వల్ల కడుపులో ఏర్పడిన అల్సర్ వుండుండి మండుతోంది.

(విపుల - నవంబరు 2009)